క్లుప్తంగా

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ



కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ ఫైజున్నీసా బేగమ్

మిడుతూరు: స్థానిక మండల రిసోర్స్ భవనంలో మండల విద్యాధికారిగా ఫైజున్నీసా బేగమ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నందికొట్కూరు ఎంఈఓగా పనిచేసిన ఫైజున్నీసా బేగమ్ మిడుతూరు ఎంఈఓగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండలంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించడంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తదితర రిజిస్టర్లను పరిశీలించారు. ఎంఈఓ–2 శ్రీనాథ్, కేజీబీవీ ఎస్‌ఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్యార్చన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై నల్గొండకు చెందిన సిద్ధేంద్రయోగి కూచిపూడి నృత్యకళాశాల బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అలరించారు. మహాగణపతిం, నమఃశివాయతే, ఓం నమఃశివాయ, శివలీలలు, ఈశ్వరా పరమేశ్వరా, నమఃశివాయతే తదితర గీతాలకు శరణ్య, వేదశ్రీ, తేజస్వి, సహస్ర, సిరిసహస్ర, వైష్ణవి, కీర్తి, సురేష్, నిత్యశ్రీ, చైత్ర, దీక్షిత, నవ్య, పరిణీత, కృతికారెడ్డి, భవిష్య, తేజశ్రీ తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి



నిర్వాహకులు, మత పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా విగ్రహ కమిటీ నిర్వాహకులు, మత పెద్దలు సహకరించాలని తహసీల్దార్ కేవీ శ్రీనావాసులు కోరారు. శుక్రవారం సున్నిపెంటలో సమావేశం నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామంలోని అన్ని మతాల వారు సహకరించాలని కోరారు. విగ్రహాల వద్ద విద్యుత్ సౌకర్యం మెరుగ్గా ఉండేలా చూసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు న్యాయం చేయాలి



సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

ఆత్మకూరు: కేరళ రాష్ట్రంలో రవాణా కార్మికులకు సంక్షేమ చట్టం ఏర్పాటు చేశారని, అదే తరహాలో దేశవ్యాప్తంగా రవాణా కార్మికులకు సంక్షేమ చట్టాన్ని, సాంఘిక భద్రతను కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మూడు క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చిందని.. ఈ చట్టాలతో కార్మికులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రవి, మాబాషా, శివ, రమణ, కాశీ, పవన్, సల్మాన్‌రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



గ్రామంలో శానిటేషన్ పరిశీలిస్తున్న వైద్యాధికారి

వెలుగోడు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వేల్పనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జహీర్ వలి అన్నారు. శుక్రవారం రేగడగూడూరు గ్రామంలోని హెల్త్ సెంటర్లను తనిఖీ చేసి గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఏ చిన్న జబ్బు వచ్చినా ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలన్నారు. గ్రామంలో బోరింగ్‌లు, మురుగు కాలువలు, వాటర్ ట్యాంకుల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

మట్టి గణపతి.. మనసా స్మరామి



మహానంది: తయారు చేసిన మట్టి వినాయకులను చూపుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

శ్రీశైలంటెంపుల్: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఉచితంగా వినాయక స్వామి మట్టి విగ్రహాలను పంపిణీ చేసింది. శుక్రవారం దేవస్థాన పరిపాలన భవనంలో మట్టి విగ్రహాలతో పాటు పాటు మారేడు, గరిగె, ఉమ్మెత్త, రేగు, మామిడి, గన్నేరు, జమ్మి, రావి, జిల్లేడు మొదలగు పత్రాలను భక్తులకు అందజేశారు. సంస్కృతి సంప్రదాయాలపై భక్తుల్లో అవగాహన కల్పించేందుకు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా వినాయక చవితిని జరుపుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, ఏఈఓ హరిదాసు, పీఆర్వో టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టి చేతుల్లో బుల్లి గణపయ్యలు

మహానంది: మండల కేంద్రంలోని ఎం.తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం పండుగ వాతావరణం కనిపించింది. విద్యార్థులు మట్టి గణనాథులను తయారు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, పాఠశాల ఉపాధ్యాయురాలు అసిఫా ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టిగణనాథులను తయారు చేశారు. ఎకో ఫ్రెండ్లీ గణేశా పేరుతో ప్రతి ఒక్కరు వినాయకుడిని ఒక్కో రూపంలో అందంగా రూపుదిద్దారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలనే ఉద్దేశంతో విద్యార్థులు మట్టితో వినాయకులను అందంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

మహానంది: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దార్ రమాదేవి అన్నారు. మహానంది డీఆర్‌ఓ హైమావతి సహకారంతో శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మహానందిలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. మట్టి గణపయ్యలను పూజించాలని సూచించారు. మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు రామలింగారెడ్డి, మధు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న శ్రీశైలం ఆలయ అధికారులు

శ్రీశైలం: శ్రీశైల హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో క్షేత్ర పరిధిలోని మేకల బండ చెంచుగూడెం, మాణిక్యేశ్వరి మాత గిరిజన గూడెం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో శుక్రవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా దేవస్థానం సహాయ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ ప్రసాద్ రావు హాజరై కాలనీవాసులకు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం 500 వినాయక ప్రతిమలను మట్టితో తయారు చేయించి పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే దేవస్థానం తరఫున ఉద్యోగులు, సిబ్బందికి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

జోరుగా విక్రయాలు



పంపిణీ చేస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

ఆత్మకూరు: వినాయ చవితిని పురస్కరించుకుని శుక్రవారం వినాయక విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు, దుకాణాలు కిటకిటలాడాయి. భారీ వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, ట్రాలీలలో ఆయా మండపాల వద్దకు తరలించారు.

పల్లకీలో మహానందీశ్వర దంపతుల విహారం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు భాద్రపద మాసం, చవితి, హస్త నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆంజనేయశర్మ, అర్చకులు శరభయ్యశర్మ ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో కొలువుదీర్చి గణపతిపూజ, పుణ్యాహవాచనం, తదితర పూజలు శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన మట్టిమిద్దెలు



ఎదురుపాడులో కూలిన మట్టిమిద్దె

కొత్తపల్లి: ఎడతెరిపి లేని వర్షాలకు మట్టి మిద్దె కూలిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మండలంలోని ఎదురుపాడు గ్రామంలో వెంకటసుబ్బయకు చెందిన మట్టిమిద్దె వర్షాలకు దెబ్బతినింది. రాత్రి వర్షం పడుతున్న సమయంలో మిద్దెకు ఏర్పాటుచేసిన ధోని పారడంలేదని పైకి ఎక్కి చూశారు. ఆయన దిగిన పది నిమిషాలకు మిద్దె ఉన్నట్టుండి కూలిపోయింది. రూ.లక్ష విలువచేసే వ్యవసాయ పనిముట్లు ఇంట్లోనే ఉన్నాయని, మిద్దె కూలడంతో పనిముట్లు ధ్వంసమైనట్లు బాధితుడు వాపోయారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఉమారాణి శుక్రవారం గ్రామానికి చేరుకొని పరిశీలించారు. బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనపై నివేదిక అందించాలని వీఆర్వోకు సూచించారు. ఆర్‌ఐ జహంగీర్ వెంట ఉన్నారు.

పగిడ్యాల: నెహ్రూనగర్‌లో గొల్ల తిక్కస్వామి నివశిస్తున్న మట్టి మిద్దె శుక్రవారం తెల్లవారుజామున బయటి భాగం గోడ కూలిపడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం చోటుచేసుకోలేదు. తెల్లవారుజామున గోడ కూలడంతో అప్రమత్తమై ఇంటి నుంచి పిల్లాపాపలతో బయటకు పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నామని బాధితుడు వాపోయాడు. మండల వ్యాప్తంగా 12 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు.

అనుమతుల్లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనొద్దు

జూపాడుబంగ్లా: కుడా అనుమతుల్లేని లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కొని మోసపోవద్దని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద కుడా అధికారి రహీంబాషా నోటీసులు జారీచేశారు. జూపాడుబంగ్లా మండలం 80 బన్నూ రు రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 683లోని 2.5 ఎకరాల్లో టి.రవికుమార్ వేసిన ఇళ్లస్థలాల లేఅవుట్‌కు కుడా అనుమతుల్లేవన్నారు. అలాగే తంగడంచ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 1–2ఏ లోని 3.6 ఎకరాల్లో మేదిరిగుడికంటి సోమనాథ్ వేసిన లేఅవుట్‌కు అనుమతుల్లేవన్నారు. ఈ రెండు లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోగా రోడ్లు, విద్యుత్, కరెంటు, తాగునీరు వంటి వసతులు కల్పించరని స్పష్టం చేశారు.

అనుమతులు తప్పనిసరి

మహానంది: మండపాల వద్ద ఏర్పాటు చేసే వినాయకుడి విగ్రహాల వద్ద విద్యుత్ అలంకరణ పనులకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. విగ్రహాలను ఏర్పాటు చేసేవారు మీ సేవా కేంద్రాల్లో విద్యుత్ శాఖ పేరుతో రూ. 1,100 చెల్లించి, రసీదులను సంబంధిత అధికారులు, సిబ్బందికి అందిస్తే అనుమతులు ఇస్తామన్నారు.

నిమజ్జన పాయింట్ల పరిశీలన



శివపురం నిమజ్జన పాయింట్‌ను పరిశీలిస్తున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కొత్తపల్లి: మండలంలోని శివపురం, ఎం.లింగాపురం, గోకవరం గ్రామాల్లోని నిమజ్జన పాయింట్లను ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్‌ఐ ఎం.కేశవతో కలసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామాలలో ప్రజలు, ఉత్సవ కమిటీలతో సమావేశం అయ్యారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే విగ్రహాల వద్ద విద్యుత్ సరఫరా, షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అల్లర్లు, గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా పండగ జరుపుకోవాలని సూచించారు. శివపురం సర్పంచు చంద్రశేఖర్‌యాదవ్ ఉన్నారు.

ఇళ్లు దెబ్బతింటే దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: వర్షాల వల్ల ఇళ్లు దెబ్బతిన్నట్లయితే వెంటనే వీఆర్వోల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా 21 ఇళ్లు పాక్షికంగా, రెండు పూర్తిగా దెబ్బతిన్నట్లు సమాచారం అందిందన్నారు. ఇంకా మట్టిమిద్దెలు, పక్కా భవనాలు, పూరిగుడిసెల్లోకి వర్షపు నీరు చేరి దెబ్బతిన్నట్లయితే వీఆర్వోల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తిగా దెబ్బతిన్న మట్టిమిద్దెలకు రూ.1.30,000, పాక్షికంగా దెబ్బతిన్న పక్కాఇళ్లకు రూ.6,500, పాక్షికంగా దెబ్బతిన్న మట్టి మిద్దెలకు రూ.4వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా పారుమంచాల్లో 7, తాటిపాడు, తూడిచెర్లలో 2 చొప్పున, 80బన్నూరు, తర్తూరు, పి.లింగాపురం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున, తరిగోపులలో 10 మిద్దెలు దెబ్బతిన్నాయని తహసీల్దార్ తెలిపారు.

తాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి



సూచనలు చేస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం పట్ల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ దాసరి మేరీ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకుల వద్ద పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే వినాయక చవితి విగ్రహాల వద్ద, నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పు ప్రాతకోట నాగేశ్వరస్వామి దేవాలయ కోనేటిలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. దేవాలయం పక్కనే కేసీ కాలువ ప్రవహిస్తున్నందున 93 స్లూయిస్ నుంచి కోనేటిలోకి వచ్చినట్లు స్థానికులు గుర్తించి వీఆర్వో హరినాథ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ముచ్చుమర్రి పోలీసులకు సమాచారం తెలపడంతో కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి 20 – 30 ఏళ్ల వయస్సు ఉంటుందని, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, నల్లని బెల్టు, బ్లూ కలర్ ఫుల్ టీషర్ట్ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ వెల్లడించారు. శరీరం పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉందని ఆచూకీ తెలిసిన వారు 91211 01188, 91211 01186 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్‌ఐ కోరారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ నాగలక్ష్మి

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో 3 రోజులుగా కొత్త డయేరియా కేసులు నమోదు కాలేదని, ప్రస్తుతం వ్యాధి అదుపులో ఉన్నట్లేనని డాక్టర్ నాగలక్ష్మి చెప్పారు. శుక్రవారం కూడా వైద్య శిబిరాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 29 నుంచి గ్రామంలో అతిసారా కేసులు నమోదయ్యాయన్నారు. మొత్తం 36 కేసులు నమోదు కాగా ఒకరు మృతి చెందారని, ఇప్పటివరకు 29 మంది కోలుకుని సురక్షితంగా ఇళ్లకు చేరుకున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఆరుగురు ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారని వివరించారు. సిబ్బందిచే గ్రామంలో పర్యటిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలిస్తున్నట్లు చెప్పారు. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతుందని వెల్లడించారు.

ఎడతెరిపిలేని వర్షాలతో ఆందోళన

జూపాడుబంగ్లా: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు, ఇళ్లు దెబ్బతినడంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో గురువారం 10 గంటల నుంచి శుక్రవారం ఉదయం వరకు 17 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడ్తూరు మండలంలో అత్యధికంగా 34.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా జూపాడుబంగ్లా మండలంలో అత్యల్పంగా 17 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు. అలాగే పగిడ్యాలలో 32.8 ఎం.ఎం, కొత్తపల్లిలో 20.4 ఎం.ఎం, నందికొట్కూరులో 17.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

వ్యక్తిగత కక్షలతో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి

మహానంది: వినాయక నిమజ్జనం ఉత్సవాల్లో అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మహానంది పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం సాయంత్రం విగ్రహ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. నిమజ్జనం ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. వ్యక్తిగత కక్షలతో ఎవరైనా గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. దీంతో పాటు నిమజ్జనం వెంట మద్యం సేవించడం, డీజేలు, అసభ్యకరమైన పాట లు పెట్టడం లాంటివి చేస్తే సహించేది లేదన్నారు. వివిధ గ్రామాల విగ్రహ కమిటీ ప్రతినిధులు మారెడ్డి రామయ్య, నాగరాజు, బొల్లవరం శ్రీనివాసులు, సతీష్‌చౌదరి, శివ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులదే పూర్తి బాధ్యత

కొత్తపల్లి: వినాయ చవితి పర్వదినం నుంచి నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు విగ్రహాల వద్ద భద్రత బాధ్యత కమిటీ సభ్యులదేనని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. శక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.కేశవ ఆధ్వర్యంలో విగ్రహకమిటీ సభ్యులకు, గ్రామాల పెద్దలకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాలలో విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన నాటి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత విగ్రహ కమిటీల సభ్యులదేనన్నారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలలో నిఘా ఉంటుందని చెప్పారు. డీజేలకు అనుమతులు లేవని చెప్పారు. డీటీ పెద్దన్న, ఏఎస్‌ఐ బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.

పంట నమోదును పూర్తి చేయాలి



పంట నమోదుపై సూచనలు చేస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బందిచే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలన్నారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులు, 33 శాతానికి పైగా దెబ్బతిన్న పంటలను పరిగణలోకి తీసుకోవాలని వివరించారు. ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా పని చేయాలని సూచించారు. పంట వివరాలు నమోదైతేనే పరిహారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి జాబితా సిద్ధం చేసి 11 నుంచి 16వ తేదీ వరకు నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. 18వ తేదీ జిల్లా కలెక్టర్‌కు నష్టపోయిన రైతుల జాబితా పంపాల్సి ఉంటుందని చెప్పారు. తహసీల్దార్ సుభద్రమ్మ, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, ఉద్యానశాఖ అధికారిణి హరిచందన, డీటీ పఠాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో సర్పంచ్ వరప్రసాద్ శుక్రవారం వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు విపరీతంగా కురుస్తుండడంతో విషసర్పాల సంచారం ఎక్కువగా ఉంటుందన్నారు. కృష్ణారావు పేట గ్రామం నుంచి బస్సు దిగి గ్రామానికి చాలా మంది కాలినడక వస్తుంటారని, వారి సౌకర్యం కోసం ప్రతి విద్యుత్ స్తంభానికి బల్బులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

మిడుతూరు: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి, మిడుతూరు విశ్రాంత ఎంఈఓ మౌలాలి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. మొదటి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నాగలక్ష్మమ్మ, శివరంజని, అరుణకుమారి, విజయలక్ష్మమ్మ, సురేంద్రమోహన్, రవి మనోహర్, సాదిక్, జమీలున్నీసా, కరిస్మా, యాసిన్ బాషలను పూలమాలలు వేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు హృదయరాజు, ఎంఈఓ–2 శ్రీనాథ్, హెచ్ఎం సాయితిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం



వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల క్షయ వ్యాధితో పాటు ఇతర వ్యాధులు నయం అవుతాయని డాక్టర్ ప్రతాప్, టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జానాలగూడెంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. రక్తహీనత, షుగర్, బీపీ వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయాలు, మాంసం వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడగట్టిన నీటిని తాగాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. అర్హులైన వారు బీసీజీ టీకా వేయించుకోవాలన్నారు. రూ.3వేలు ఖరీదైన క్షయ నిర్ధారణ గళ్ల పరీక్షను ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చేస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డీటీ కౌన్సిలర్ మోతిలాల్, జానకీ, గీత తదితరులు పాల్గొన్నారు.

నిండా మునిగిన రైతన్నలు



నీట మునిగిన పంటను చూస్తున్న రైతు

కొత్తపల్లి: ఎడతెరపిలేని వర్షాలకు రైతన్నలు నట్టేట మునిగారు. తమను ఆదుకునే దిక్కెవరని ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని జడ్డువారిపల్లి గ్రామంలో రైతులు దాదాపు 40 ఎకరాల్లో ఉల్లి పంటను సాగుచేశారు. భారీ వర్షాలకు వరద పొలాల్లోకి చేరడంతో పైరు నీటమునిగింది. దీంతో రైతన్నలు పంట సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని అంతర్మథనం చెందుతున్నారు. ఒక్కో రైతు ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కనీసం పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు లింగస్వామి యాదవ్, బాబు శుక్రవారం వారి పంట పొలాలను చూసి బాధను వెలిబుచ్చారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రమేష్‌బాబు

జూపాడుబంగ్లా: అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కర్ణ డిమాండ్ చేశారు. వారు శుక్రవారం మాట్లాడుతూ పారుమంచాల గ్రామంలోని ఇసుకవాగు, నల్లవాగు, ఎర్రవాగు, కాకిలేరువాగు ఉప్పొంగడంతో ఉల్లి, టమాటా, మొక్కజొన్న, వరి, పత్తి, మిరప పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. చేతికొచ్చే దశలో పంటలు దెబ్బతినటంతో రైతులు భారీగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం మంజూరు చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. అలాగే ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారంతో పాటు పక్కా గృహాలను మంజూరు చేయించాలని కోరారు. నాయకులు దివాకర్, రాజు, పెద్దన్న, కలిముల్లా, రాముడు, తదితరులు పాల్గొన్నారు.